క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

కాటారం: మండలంలోని దామెరకుంట సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల కళాశాలలో 2023–24 విద్యా సంవత్సరానికి గాను ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ మైథిలి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎంపీసీలో 18 సీట్లు, బైపీసీ విభాగంలో 6 సీట్లు ఖాళీగా ఉన్నట్లు ఆమె పేర్కొన్నారు. పదవ తరగతిలో ఉత్తీర్ణులైన విద్యార్థునులు ఈ నెల 15లోగా దామెరకుంట కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ సూచించారు.

ఎలక్ట్రీషియన్‌గా సర్పంచ్



టేకుమట్ల: గ్రామ పంచాయతీ సిబ్బంది సమస్యలను నెరవేర్చాలని కోరుతూ సమ్మె చేపట్టడంతో గ్రామంలోని ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలుగకూడదనే సంకల్పంతో మండలంలోని బండపల్లి సర్పంచ్ నామని రాజేందర్ ఎలక్ట్రీషియన్‌గా మారాడు. గ్రామంలో విద్యుత్ దీపాలు వెలగకపోవడంతో సర్పంచ్ స్వయంగా స్తంభం ఎక్కి మంగళవారం విద్యుత్ దీపాలను అమర్చాడు.

అధికారులను కలిసిన నాయకులు



భూపాలపల్లి రూరల్: భూపాలపల్లి తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన శ్రీనివాస్‌ను, ఎస్సైలుగా బాధ్యతలు చేపట్టిన ఎస్సైలు శ్రావణ్‌కుమార్, సంధ్యారాణిలను బీజేపీ భూపాలపల్లి అర్బన్ అధ్యక్షుడు మధుసూదన్ రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలించారు. ఈ సందర్భంగా వారిని సన్మానించారు. ఈ కార్యక్రమాల్లో అర్బన్ ప్రధాన కార్యదర్శి తుమ్మేటి రామ్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు సుధాకర్, తోట ఓదెలు, రేగళ్ల రవీందర్, కరివేద మనోహర్ రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యుడు పొన్నాల కొమురయ్య, కిరణ్, మధుకర్ తదితరులు పాల్గొన్నారు.

సన్మానం



టేకుమట్ల: టేకుమట్ల తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన మంజులను మంగళవారం ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు సంగి రవి మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందించి శాలువతో సన్మానించారు. ఆయన వెంట దుబ్యాల ఉప సర్పంచ్ విజయబంగారి, బొజ్జపెల్లి శంకర్, నానవేని కుమార్, మాదుగుల ప్రకాశ్, మిట్టపెల్లి బాలు, అనిల్, పుల్లూరి శంకర్, కుమార్, సంపత్, సదయ్య, రాజేందర్, శ్రీను, సతీష్, నవీన్, రాజేందర్, తదితరులు ఉన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ



భూపాలపల్లి రూరల్: యూఎస్‌పీసీ భూపాలపల్లి జిల్లా స్టీరింగ్ కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 12న చేపట్టనున్న ర్యాలీ, ధర్నాను ఉపాధ్యాయ ఉద్యోగులు విజయవంతం చేయాలని ఆ కమిటీ నాయకులు ఉద్యోగులకు పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం జిల్లా ఉన్నత పాఠశాల ఆవరణలో ధర్నాకు పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కమిటీ నాయకులు మాట్లాడుతూ.. ప్రభుత్వం వెంటనే పీఆర్సీ కమిటీని వేయాలని సీపీఎస్‌ను రద్దు చేసి ఏపీఎస్‌ను పునరుద్ధరించాలన్నారు. అదేవిధంగా ఉపాధ్యాయుల బదిలీలు, ప్రమోషన్లు చేపట్టాలన్నారు. వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఎల్‌ఓసీ అందజేత



మల్హర్: మండలంలోని తాడిచర్ల గ్రామానికి చెందిన రొద్ద లింగయ్య అనారోగ్యంతో హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. వైద్య ఖర్చుల నిమిత్తం కుటుంబ సభ్యులు పెద్దపెల్లి జెడ్పీచైర్మన్ పుట్ట మధును సంప్రదించగా ప్రభుత్వం నుంచి సీఎంఆర్ఎఫ్ ద్వారా రూ.2.50లక్షలు మంజూరు చేయించారు. ఈ మేరకు మధు వ్యక్తిగత సహాయకుడు మంగళవారం నిమ్స్ ఆస్పత్రిలో కుటుంబ సభ్యులకు అందజేశారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం



చిట్యాల: మాట్లాడుతున్న సూపర్‌వైజర్ జయప్రద



మొగుళ్లపల్లి: వేములపల్లిలో..

భూపాలపల్లి రూరల్: పౌష్టికాహారం తీసుకోవడంతోనే ఆరోగ్యంగా ఉంటామని సర్పంచ్ రాజిరెడ్డి తెలిపారు. మంగళవారం భూపాలపల్లి మండలంలోని నాగారం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో కిశోర బాలికలకు కిశోరామృతం పంపిణీ కార్యక్రమం చేశారు. ఈ కార్యక్రమానికి సర్పంచ్ పిన్‌రెడ్డి రాజిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై కిశోరామృతం ప్యాకెట్లు పంపిణీ చేసి మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రాలను బీఆర్ఎస్ ప్రభుత్వం బలోపేతం చేసిందన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలకు చిన్న పిల్లలను పంపించడం వలన బలమైనా పౌష్టికాహారం అందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ కొంగొండ వినోదసాయికృష్ణ, గ్రామ కార్యదర్శి రాములు, అంగన్‌వాడీ టీచర్ స్వర్ణలత పాల్గొన్నారు.

కిశోరామృత ప్యాకెట్లు పంపిణీ

చిట్యాల: మండలంలోని నైన్‌పాక గ్రామం రెండవ అంగన్‌వాడీ కేంద్రంలో కిశోరామృత ప్యాకెట్లును సర్పంచ్ తోట్ల లక్ష్మి ఐలయ్య చేతుల మీదుగా మంగళవారం బాలికలకు పంపిణీ చేసినట్లు అంగన్‌వాడీ సూపర్‌వైజర్ జయప్రద తెలిపారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ జయప్రద మాట్లాడుతూ.. ప్రతి బాలిక రోజుకు 140 గ్రాముల చొప్పున కిశోరామృతం తీసుకోవాలన్నారు. అనంతరం సర్పంచ్ తొట్ల లక్ష్మి మాట్లాడుతూ.. నేటి బాలికలే రేపటి మాతృ మూర్తులని ప్రతీ ఆహారాన్ని జాగ్రత్తగా తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శి విష్ణువర్ధన్, అంగన్‌వాడీ టీచర్స్ సుభద్ర, సుజాత, కరుణ, ఆశ వర్కర్లు, కిశోర బాలికలు, తదితరులు పాల్గొన్నారు.

మొగుళ్లపల్లి: మండలంలోని వేములపల్లి గ్రామంలోని అంగన్‌వాడీ సెంటర్లలో మంగళవారం గ్రామ సర్పంచ్ మాధవి ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. బిడ్డ పుట్టిన వెంటనే గంటలోపు ఖచ్చితంగా ముర్రుపాలు పట్టించాలన్నారు. అనంతరం బాలికలకు కిశోరామృతం పంపిణీ చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు స్వరూపరాణి, అనిత, జ్యోతి, సబిత ఆశ వర్కర్లు పాల్గొన్నారు.



భూపాలపల్లి రూరల్: బాలికలకు కిశోరామృతం ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న సర్పంచ్ రాజిరెడ్డి

నిత్యావసర సరుకుల పంపిణీ



సరుకులు పంపిణీ చేస్తున్న నాయకులు

భూపాలపల్లి రూరల్: మోరంచపల్లి గ్రామంలో ఇటీవల వరద బీభత్సంలో సర్వస్వం కోల్పోయిన 32 ముదిరాజ్ కుటుంబాలకు మంగళవారం స్ఫూర్తి ఫిష్ సీడ్ యాజమాన్యం ఆధ్వర్యంలో నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. జిల్లా ముదిరాజ్ మహాసభ తరఫున మహాసభ జిల్లా అధ్యక్షుడు జోరుక సదయ్య యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా మత్స్య శాఖ అధికారి అవినాష్, వరంగల్ ఉమ్మడి జిల్లా మత్స్య పారిశ్రామిక సహకార సంఘం ఉపాధ్యక్షులు యాకయ్య, స్ఫూర్తి ఫిష్ సీడ్ ఫామ్ పార్టనర్ ముత్యపు సత్యనారాయణ, నాయకులు కట్ల సదానందం, పండుగ రమేష్, భీమ మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

బాధితులను ఆదుకునే బాధ్యత అందరిది..

వరద ముంపునకు గురై సర్వస్వాన్ని కోల్పోయిన భూపాలపల్లి మండలంలోని మోరంచపల్లి గ్రామస్తులను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని వేణుగోపాల్‌రావు అన్నారు. మంగళవారం మోరంచపల్లి గ్రామంలో ఇంటింటికీ సుమారుగా రూ.1వేయి విలువ చేసే నిత్యావసర సరుకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కల్యాణి డెవలపర్స్ సభ్యులు వెంకటేశ్వర్లు, సతీష్, మోహన్‌రావు, రతన్ పాల్గొన్నారు.



కల్యాణి డెవలపర్స్ సభ్యుల ఆధ్వర్యంలో..

పోలింగ్ కేంద్రాల పరిశీలన



పరిశీలిస్తున్న తహసీల్దార్ నాగరాజు

కాటారం: మండలంలోని చింతకాని, ఇబ్రహీంపల్లి, అంకుషాపూర్, మేడిపల్లి, సుందరాజ్‌పేట, కొత్తపల్లి పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ నాగరాజు మంగళవారం పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల్లో విద్యుత్, తాగునీరు, ఫర్నీచర్, ర్యాంప్, మరుగుదొడ్లు తదితర అంశాలపై ఆరా తీశారు. తహసీల్దార్ వెంట ఆర్ఐ వెంకన్న, వీఆర్ఏ జితేందర్ ఉన్నారు.

విద్యార్థులకు అవగాహన



అవగాహన కల్పిస్తున్న పోలీసులు

మొగుళ్లపల్లి: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ ఆధ్వర్యంలో విద్యార్థులకు పలు విషయాలపై మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏహెచ్‌టీయూ కానిస్టేబుల్ ప్రవీణ్, శ్రీనాథ్ మానవ అక్రమ రవాణ, పిల్లలపై జరుగు లైంగిక దాడులు, బాల కార్మిక రవాణ, గంజాయి వంటి మత్తుపానీయాల నివారణ, మహిళలపై జరుగు దాడులు, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. తీసుకోవలసిన జాగ్రత్తలు, నివారణ చర్యలను విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రమేష్, ఉపాధ్యాయులు వెంకన్న, విజిత, అనిల్, సురేందర్, చందర్, తదితరులు పాల్గొన్నారు.

సొంతింటి కల నెరవేరేనా?



చిన్న పిల్లలతో వచ్చి దరఖాస్తు నింపుతున్న మహిళ



తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో ప్రజలు

టేకుమట్ల: రాష్ట్ర ప్రభుత్వం ఇళ్లు లేని నిరుపేదలకు ఇంటి స్థలం ఉంటే నిర్మించుకునేందుకు రూ.3లక్షలతో ప్రవేశపెట్టిన గృహలక్ష్మి పథకానికి మండలంలోని అన్ని గ్రామాల ప్రజలు తరలి వచ్చి దరఖాస్తులను తహసీల్దార్ కార్యాలయంలో అందజేస్తున్నారు. చంటి పిల్లలతో వచ్చిన మహిళలు, వృద్ధులు ఆన్‌లైన్ సెంటర్, మీసేవా కేంద్రాల్లో బారులు తీరి తీవ్ర ఇబ్బందులు పడ్డారు. దరఖాస్తుల స్వీకరణకు ఈనెల 10తో ముగుస్తుండడంతో మంగళవారం పెద్ద సంఖ్యలో ప్రజలు దరఖాస్తులను సమర్పించారు. ఇటీవల బీసీలకు రూ.1లక్ష పథకం మొదలై ఇప్పటి వరకూ ఏ ఒక్కరికి ఇవ్వలేదని, గృహలక్ష్మీతో నైనా సొంతింటి కల నెరవేరేనా అంటూ పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కొనసాగిన కార్మికుల సమ్మె



చిట్యాల: మౌనం పాటిస్తున్న జీపీ సిబ్బంది



మొగుళ్లపల్లి: సమ్మెలో పాల్గొన్న సిబ్బంది

చిట్యాల: మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయం ఎదుట గ్రామ పంచాయతీ కార్మికులు చేపట్టిన సమ్మె మంగళవారం 34వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా పంచాయతీ కార్మికుల సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు మ్యాదరి రాజేందర్, జిల్లెల కుమార్ మాట్లాడుతూ.. జీపీ కార్మికుల డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అలాగే కరీంనగర్ జిల్లా కొత్తపల్లి మండలం చింతకుంట గ్రామంలో పని చేస్తున్న కార్మికుడు మేరుగు రాజు హఠాన్మరణం చెందాడు. దీంతో అతడి ఆత్మకు శాంతి చేకురాలని రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది సతీష్, రాజయ్య, శంకర్, మొగిలి, కరుణాకర్, నరేష్, రత్నాకర్, భద్రయ్య, రాము, సమ్మక్క, సారక్కతో పాటు తదితరులు పాల్గొన్నారు.

మొగుళ్లపల్లి: తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం ఎదుట పంచాయతీ సిబ్బంది చేస్తున్న సమ్మె మంగళవారం 34వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ ఉద్యోగుల సంఘం మండల అధ్యక్షుడు బైరగోని కుమారస్వామి మాట్లాడుతూ.. ప్రభుత్వం స్పందించి సిబ్బందిని పర్మనెంట్ చేయాలన్నారు.

అస్వస్థతకు గురైన పంచాయతీ కార్మికుడు



చికిత్స పొందుతున్న సదాశివుడు

టేకుమట్ల(రేగొండ): రేగొండ మండల కేంద్రంలో కొనసాగుతున్న పంచాయతీ కార్మికుల సమ్మెలో రేగొండ మండలంలోని రేపాకపల్లి గ్రామ పంచాయతీ కార్మికుడు సదాశివుడు మంగళవారం అస్వస్థతకు గురయ్యాడు. దీంతో తోటి పంచాయతీ కార్మికులు అతడిని చికిత్స నిమిత్తం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించి చికిత్సనందించారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యులు ప్రకటించినట్లు తెలిపారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



ఆర్థికసాయం అందిస్తున్న నాయకులు

మల్హర్: మండలంలోని తాడిచర్ల గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన రామయ్య, నర్సింగం, రామయ్య కుటుంబాలను బీఆర్ఎస్ నాయకులు మంగళవారం పరామర్శించారు. అనంతరం వారికి ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో రైతుబంధు సమితి మండల అధ్యక్షుడు గోనె శ్రీనివాసరావు, సర్పంచ్ సుంకరి సత్తయ్య, మండల మాజీ అధ్యక్షుడు తాజోద్దీన్, గ్రామశాఖ అధ్యక్షుడు మధుసూదన్‌రావు, మల్లేష్, సాంబయ్య, వడ్డెర సంఘం నాయకులు కుమారస్వామి, సమ్మయ్య, బాలయ్య, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యలు పరిష్కరించాలి



తహసీల్దార్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎంపీపీ, నాయకులు

కాటారం: కాటారం మండలంలో నెలకొన్న పట్టా, అసైన్డ్ భూ సమస్యలను పరిష్కరించాలని తహసీల్దార్ నాగరాజును ఎంపీపీ పంతకాని సమ్మయ్య కోరారు. ఇటీవల బాధ్యతలు స్వీకరించిన తహసీల్దార్‌ను మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో ఎంపీపీ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. మండలంలోని పలు భూ సమస్యలు, తదితర అంశాలపై చర్చించారు. అర్హులైన వారందరికీ ఓటు హక్కు కల్పించడంతో పాటు రాబోవు సార్వత్రిక ఎన్నికలు మండలంలో స్వేచ్ఛాయుత వాతావరణంలో కొనసాగేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. గృహలక్ష్మి పథకంలో దరఖాస్తు చేసుకునే లబ్ధిదారులకు కుల, నివాస, ఆధాయ ధృవీకరణపత్రాలు, నివాస స్థల పత్రం, తదితర పత్రాల విషయంలో వెసులుబాటు కల్పించేలా కొంత సమయం ఇవ్వాలని తహసీల్దార్‌ను కోరారు. తహసీల్దార్ సానుకూలంగా స్పందించినట్లు ఎంపీపీ తెలిపారు. ఎంపీపీ వెంట దబ్బెట రాజేశ్, గడ్డం కొంరయ్య, లక్ష్మణ్, సద్వలి ఉన్నారు.

‘గృహలక్ష్మి’ దరఖాస్తు గడుపు పెంచాలి



మహాముత్తారంలో తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

మల్హర్(మహాముత్తారం): గృహలక్ష్మి పథకానికి సంబంధించిన దరఖాస్తుల గడువుని పెంచాలని బహుజనసమాజ్(బీఎస్పీ)పార్టీ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు మహాముత్తారం తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ శ్రీనివాస్‌కు బీఎస్పీ నాయకులు మంగళవారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గృహలక్ష్మి దరఖాస్తు గడువు తక్కువగా ఉందన్నారు. దీంతో చాలా మంది లబ్ధిదారులు దరఖాస్తు చేసుకోలేక పోతున్నారని వెల్లడించారు. ఈకార్యక్రంలో బీఎస్పీ యువజన నాయకులు గుండు ధర్మా తదితరులు పాల్గొన్నారు.

కాటారం: ప్రభుత్వం ప్రవేశపెట్టిన గృహలక్ష్మి పథకం దరఖాస్తు గడువు తేదీని పెంచాలని ప్రజా సంఘాల నాయకుడు పీక కిరణ్, బీఎస్పీ మండల కన్వీనర్ బొడ్డు రాజబాబు మంగళవారం వేర్వేరు ప్రకటనల్లో కోరారు. రెండో సారి అధికారంలోకి వస్తే నిరుపేదలకు సొంత స్థలంలో ఇళ్లు నిర్మించుకోవడానికి రూ.5లక్షలు ఇస్తామని మేనోఫెస్టోలో పెట్టిన బీఆర్ఎస్ ప్రభుత్వం గృహలక్ష్మి పేరిట రూ.3లక్షలకే పరిమితం చేయడం శోచనీయం అన్నారు. ప్రభుత్వం సరైన ప్రచారం లేకుండా దరఖాస్తుల స్వీకరణకు ఈ నెల 10 వరకు చివరి తేదీ అని ఐదు రోజుల ముందు ప్రకటన ఇవ్వడం సరికాదని తెలిపారు. మూడు రోజుల్లో ఎంత మంది దరఖాస్తు చేసుకుంటారని ప్రశ్నించారు.

చిట్యాల: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన గృహలక్ష్మీ పథకంలో ఇళ్లకు దరఖాస్తు చేసుకోవడానికి గడువును పెంచాలని అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర కమిటి సభ్యులు పుల్ల మల్లయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే దివ్యాంగులందరికీ గృహలక్ష్మీ పథకంలో ఇళ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.

మహిళలు కాంగ్రెస్‌కు అండగా ఉండాలి



నియామక పత్రాలు అందిస్తున్న శ్రీదేవి, లక్ష్మి

చిట్యాల: మహిళలంతా కాంగ్రెస్ పార్టీకి అండగా ఉండాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా మహిళా అధ్యక్షురాలు గుమ్మడి శ్రీదేవి అన్నారు. మంగళవారం మండలంలోని కైలాపూర్ గ్రామంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆమె పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో రానున్న రోజులలో అధికారంలోకి వచ్చేది కాంగ్రెస్ పార్టీయేనని అన్నారు. రాష్ట్ర జనాభాలో సగభాగం మహిళలు ఉన్నారని అధికారంలోకి రాగానే దీపం పథకం కింద రూ.5 వందలకే గ్యాస్ సిలెండర్, ఆర్టీసీ బస్సులలో ఉచిత ప్రయాణం, గృహలక్ష్మీ పథకం కింద ఇంటి నిర్మాణం కోరకు రూ.5 లక్షలు ఇవ్వనున్నట్లు తెలిపారు. అనంతరం మండల అధ్యక్షురాలు మేరుగు లక్ష్మీ ఆధ్వర్యంలో గ్రామ కమిటీని ప్రకటించారు. అధ్యక్షురాలుగా దానవేని వనీత, ఉపాధ్యక్షురాలు బుదరపు స్వరూప, ప్రధాన కార్యదర్శురాలుగా సుంచు బుచ్చమ్మ, కోశాధికారిగా మేకల కమలతో పాటు సభ్యులను ఎన్నుకొని నియామక పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బ్యాగుల పంపిణీ



బ్యాగులు పంపిణీ చేస్తున్న ఎస్సై రాజు

మహదేవపూర్: మండల కేంద్రంలోని జిల్లా ప్రజా పరిషత్ పాఠశాలలో 60 మంది విద్యార్థులకు దాతల సాయంతో ఎస్సై 2 రాజు, సీఆర్పీఎఫ్ ఎస్సై సంజయ్ నికాడె స్కూల్ బ్యాగులను అందజేశారు. స్కూల్ బ్యాగ్ ఛాలెంజ్–2023 పిలుపు మేరకు గోదావరిఖనికి చెందిన వ్యాపారవేత్తలు చంద్రగుప్త, సత్య ప్రసాద్, కిశోర్, రాజు, సురేష్‌ల సహకారంతో విద్యార్థులకు అందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు అశోక్, ప్రభాకర్‌రెడ్డి, తిరుపతి రెడ్డి, మధు, రాజయ్య, దేవేందర్‌రెడ్డి, సక్కరాం, సర్దార్‌సింగ్, రాజనాయక్, ప్రవీణ్ రెడ్డి, అనిల్ కుమార్, శ్రీనివాస్ పాల్గిన్నారు.

ఇళ్ల స్థలంలో మొక్కలు నాటకుండా చూడాలి



వినతిపత్రం అందజేస్తున్న మల్లారం గ్రామస్తులు

కాటారం: కాటారం మండలం గుండ్రాత్‌పల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని మల్లారంలో గుడిసెలు వేసుకున్న తుముగుంట భూమిలో ఫారెస్ట్ అధికారులు మొక్కలు నాటకుండా చూడాలని కోరుతూ గ్రామస్తులు మంగళవారం తహసీల్దార్ నాగరాజుకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మల్లారం గ్రామస్తులందరం కలిసి 1989 నుంచి తుముగుంట భూమిలో గుడిసెలు వేసుకున్నట్లు పేర్కొన్నారు. ప్రతి ఏడాది అన్నారం బ్యారేజ్ బ్యాక్ వాటర్ కారణంగా గ్రామంలోకి నీరు వస్తే తుముగుంటలో ఉన్న గుడిసెల్లో నివాసం ఉంటున్నట్లు పేర్కొన్నారు. కాగా అటవీశాఖ అధికారులు ఆ భూమిలో మొక్కలు నాటుతున్నారని తెలిపారు. ఈ ప్రక్రియను నిలిపివేసేలా చర్యలు తీసుకొని గ్రామస్తులకు న్యాయం చేయాలని కోరారు. వినతిపత్రం సమర్పించిన వారిలో దుర్గం తిరుపతి, ప్రశాంత్, నరహరి, రాజయ్య, అంజు, లక్ష్మయ్య, సంధ్య, మౌనిక, సంధ్య తదితరులు ఉన్నారు.